ప్రజాశక్తి
సోమవారం 24 జులై 2023
5
విజయనగరం

25న మడ్డువలస నీరు విడుదల

ప్రజాశక్తి-వంగర

మండలంలోని గొర్లె శ్రీరాములనాయుడు మడ్డువలస ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా ఆయకట్టుకు ఈ నెల 25న సాగునీరు విడుదల చేస్తామని ప్రాజెక్టు డిఇ పి.అర్జున్ తెలిపారు. స్టేజ్-1లో వంగర, రేగిడి, సంతకవిటి, శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, పొందూరు మండలాలకు, స్టేజ్-2లో లావేరు మండలానికి సంబంధించి మొత్తం 30077 ఎకరాలకు గాను నీటిని విడిచిపెడతామని చెప్పారు. తొలి విడతలో 100 క్యూసెక్కుల నీటిని విడిచిపెడతామని తెలిపారు. ఆయకట్టు రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. మడ్డువలస ప్రాజెక్టు 65 మీటర్ల స్థాయి నీటిమట్టానికి గాను ప్రస్తుతం 60.22 మీటర్లు నీటిమట్టం ఉందని చెప్పారు. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 532 క్యూసెక్కులు మాత్రమే ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతోందని వెల్లడించారు.

ఆండ్ర ఘోష పట్టదా?

3 మండలాలు... 22 గ్రామాల పరిధిలో 9426 ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ఆండ్ర రిజర్వాయరును నిర్మించారు. లక్ష్యం దిశగా ఏనాడూ సాగునీరు అందించే పరిస్థితి లేదు. పైగా ఏటా కొత్త సమస్యలు చుట్టుముడుతున్నాయి. రిజర్వాయరు నిర్వహణ చూసే నాథుడు లేక నీటి నిల్వ సామర్థ్యం తగ్గడంతోపాటు ఆయకట్టుకు నీరందించలేక పోతోంది. స్పిల్‌వే గేట్ల ద్వారా నీరు లీకులతో వచ్చిననీరు వచ్చినట్టే చంపావతి నదిలో చేరిపోతోంది. మరోవైపు రెగ్యులేటర్ గోడలపై ప్రమాదకరంగా మొక్కలు పెరగడంతో ఎప్పుడు ఏ ముప్పు ముంచుకొస్తుందోనన్న ఆందోళన వెంటాడుతోంది.

రిజర్వాయరులో తక్కువగా ఉన్న నీటిమట్టం

- స్పిల్‌వే గేట్ల ద్వారా లీకులు
- వచ్చిననీరు వచ్చినట్టే చంపావతిలోకి...
- రెగ్యులేటర్ గోడలపై ప్రమాదకర మొక్కలు
- రిజర్వాయరు నిర్వహణను పట్టించుకోని యంత్రాంగం

గేట్ల నుంచి లీకవుతున్న నీరు

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడ మండలంలోని ఆండ్ర వద్ద 9426 ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 146 మీటర్లు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 138 మీటర్లకు అట్టడుగుకు చేరుకుంది. ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు 9 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. శివారు గ్రామాలకు సుమారు 426 ఎకరాలకు సాగునీరు అందే పరిస్థితి ప్రశ్నార్థకమే. ఈ రిజర్వాయర్ ద్వారా గజపతినగరం, బొండపల్లి, మెంటాడ మండలాల్లో 22 గ్రామాల రైతులకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం మెంటాడ మండలం మినహా మిగతా రెండు మండలాలకు సాగునీరు ఇబ్బందికరమే. స్పిల్ వే గేట్ల ద్వారా లీకుల వల్ల నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు. లీకుల ద్వారా వచ్చిన నీరు చంపావతి నదిలోకి పోతుంది. ఇదే తతంగం ఏడాది నుంచి కొనసాగుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకునే దాఖలాలు లేవు. రెగ్యులేటర్ గోడలపై ప్రమాదకరమైన మొక్కలు పుట్టుకొచ్చాయి. జలాశయం రాతి కట్టడాలపై పిచ్చిమొక్కలు, డొంకలు, తుప్పలు ఉండడంతో ప్రాజెక్టు బీటలు వారి పెనుప్రమాదం వాటిల్లే పరిస్థితి నెలకొంది.

అక్కరకురాని జైకా నిధులు

ఆండ్ర ప్రాజెక్టు ఆధునికీకరణ కోసం జైకా నిధులు రూ.18 కోట్లను నాబార్డు మంజూరు చేసింది. ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాలువల పనులు 70 శాతం పూర్తి చేసినట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు. ఆధునికీకరణ పనులు చేపట్టిన రెండేళ్లకే ఆయా కాలువల తుప్పలు, డొంకలు, పూడికతీతలు లేక మరి అధ్వానంగా తయారయ్యాయి. అరకొరగా 70శాతం జైకా నిధులతో పనులు చేపట్టినప్పటికీ, మిగతా 30 శాతం పనులు జాప్యం వెనుక ఆంతర్యమేమిటనని రైతులు వాపోతున్నారు. జలాశయం నిర్వహణకు ఏటా నిధులు మంజూరు చేస్తూ నిర్వహణ పనులు చేపట్టిన దాఖలాలు లేవు. ఇంతకూ నిర్వహణ నిధులు ఎక్కడని పలువురు ఆరోపిస్తున్నారు.

శిథిలావస్థలో పిల్ల కాలువలు

కుడి, ఎడమ కాలువల అనుబంధ పిల్లకాలువలకు గండ్లు ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా నేటికీ పూడ్చలేదు. ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధుల వద్ద రైతులు పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం. ఎడమ కాలువల పిల్లకాలువ 1ఎల్‌కు గండి ఏర్పడటంతో రెండేళ్ల నుంచి రైతులు తమ పెట్టుబడితో పైపుల ద్వారా సాగునీరు తెప్పించుకుని పంటలు పండించుకొంటున్నారు. 2ఎల్ కాలువ పూర్తిస్థాయిలో శిథిలావస్థలో ఉంది. ఈ కాలువ ద్వారా సుమారు 400 ఎకరాలు ఆయకట్టు ఉంది. గత ఏడాది నుంచి సాగునీరందక పంట పండించుకోవడానికి వీల్లేకుండా పోయింది. రైతుల సొంత ఖర్చుతో జెసిబి సహాయంతో పనులు చేపట్టడం విశేషం. ఇదే పరిస్థితిలో రిజర్వాయర్ నిర్వహణ కొనసాగిస్తే రైతులకు సాగునీటి కష్టాలు తప్పవు.

విజయనగరంలో ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనింగ్ కమిటీ ఆధ్వర్యాన కొవ్వొత్తుల ప్రదర్శన చేపడుతున్న విద్యార్థినులు

మణిపూర్ హత్యాకాండపై నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మణిపూర్ రాష్ట్రంలో మైనార్టీలపై హత్యలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా జిల్లాలో పలుచోట్ల సిపిఎం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసనలు చేపట్టారు. ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో కోట జంక్షన్ నుంచి గంటస్తంభం వరకు ఆదివారం సాయంత్రం కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు సిహెచ్ పావని, ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ మాట్లాడుతూ మణిపూర్‌లో బిజెపి సృష్టించిన అల్లర్లతో మహిళలు రోజురోజుకు అత్యాచారాలకు, హత్యలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ ఆ రాష్ట్రాన్ని పట్టించుకోవడం మానేసి, విదేశీ యాత్రలు చేయడం సిగ్గుచేటన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రి 'ఇది చాలా సాధారణమైన అంశం' అని చెప్పడం బిజెపి ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ వారిపై సామూహిక అత్యాచారం చేసి, అడ్డు వచ్చిన కుటుంబ సభ్యులను దారుణంగా చంపినా ఇప్పటివరకు పార్లమెంట్ సాక్షిగా ప్రధానమంత్రి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం చూస్తుంటే ఆయనకు ఎలాంటి దేశభక్తి ఉందో అర్థమవుతోందన్నారు. మణిపూర్‌లో హింసాకాండను పరిశీలిస్తే బిజెపి ప్రభుత్వంతో, ఆర్ఎస్ఎస్ నాయకత్వంతో ఈ దేశానికి ఎటువంటి ప్రమాదం ఉందో ఊహించవచ్చన్నారు. తక్షణమే మణిపూర్‌లో అల్లర్లను నిలుపుదల చేయడానికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు. మహిళలపై అత్యాచారాలు చేసినవారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ సౌమ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు లావణ్య, సంధ్య, దీవెన, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు

పూసపాటిరేగ, డెంకాడ : మణిపూర్‌లో జరుగుతున్న యుద్ధ కాండను ఖండిస్తూ పూసపాటిరేగ మండల కేంద్రం, డెంకాడ మండలం అక్కివరంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బి సూర్యనారాయణ మాట్లాడుతూ మణిపూర్‌లో అల్లర్లకు కారణం బిజెపియేనన్నారు. మణిపూర్‌లో 80 రోజుల నుంచి విధ్వంసకాండ కొనసాగుతున్నప్పటికీ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడంలో విఫలమైందన్నారు. ఇద్దరు మహిళలను నగ్నంగా వివస్త్రలను చేసి సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మైతి గ్రూపునకు సహకరించిన బిజెపి ముఖ్యమంత్రి వీరేందర్ సింగ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామునాయుడు, రాము, తోటయ్య, గురుమూర్తి, పోతయ్య, ఎన్.సూర్యనారాయణ, బి.నరిసినాయుడు, జి.పెంటరాజు, వై.సంతోషి, కె.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

డెంకాడలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపడుతున్న కార్మికులు, మహిళలు

రాష్ట్రస్థాయి పోటీలకు పయనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నెల్లూరులో జరిగే అండర్ -17 బాల బాలికల రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా నుండి ఎంపికైన ఎం.రోహిత్, ఎవి భారద్వాజ, కె.రేవంత్, వి.జాహ్నవి, వై. రెనుశ్రీ, కె.ప్రజ్ఞానాయుడు ఆదివారం పయనమయ్యారు. వీరికి జి.శ్రీనివాసరావు శిక్షకులుగా హాజరవుతున్నారు. జిల్లా బృందం మంచి ఫలితాలు పొందాలని సంఘం నాయకులు వివిఎస్ ప్రసాద్, కార్యదర్శి వై.కుసుమ బచ్చన్ ఆకాంక్షించారు.

భాగేంపేట గ్రామ సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

గజరాజుల బీభత్సం

ప్రజాశక్తి-వంగర

మండలంలోని శ్రీహరిపురం గ్రామంలోకి శనివారం ప్రవేశించిన గజరాజుల గుంపు బీభత్సం సృష్టించింది. ఆదివారం తెల్లవారుజామున మండలంలోని భాగేంపేట ఎస్‌సికాలనీలోకి ప్రవేశించాయి. జొన్నాడ చంటికి చెందిన వరి ధాన్యాన్ని ధ్వంసం చేశాయి. పాకలు, కొబ్బరి చెట్లు, వరి, మొక్కజొన్న చేలను ధ్వంసం చేశాయి. ఈ విషయాన్ని సర్పంచ్ రెడ్డి సత్యవతి అధికారులకు తెలియజేశారు. ప్రజలెవరూ గజరాజుల వద్దకు వెళ్ళొద్దని అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

ఇళ్ల పట్టాల మంజూరులో అవినీతి?

పట్టాకు రూ.25 వేల వరకు వసూళ్లు

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

మండలంలోని ఎం.బూర్జవలస పంచాయతీలో జగనన్న ఇళ్ల మంజూరులో అవినీతి జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎం.బూర్జ వలస పంచాయతీలో ఎం.బూర్జ వలస, ఎం.పనుకువలస, గున్నతోట వలస గ్రామాలు ఉన్నాయి. జగనన్న ఇళ్ల పట్టాల మంజూరులో అనర్హుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసి ఇళ్ల పట్టాలు అందించినట్లు తెలిసింది. మూడు గ్రామాల్లో సొంతిల్లు ఉన్న ఒక్కొక్కరి నుంచి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు అధికార పార్టీ నాయకులు వసూలు చేసినట్లు చర్చ సాగుతోంది. ఇళ్ల పట్టాల అవినీతిలో సమీప పంచాయతీ విఆర్ఒ హస్తం ఉన్నట్లు సమాచారం.

ఎం.బూర్జవలసలో జగనన్న లేఅవుట్

రెగ్యులర్ విఆర్ఒ రిజెక్ట్ చేసినా..

ఎం.బూర్జవలస పంచాయతీలో సొంతిల్లు ఉన్నప్పటికీ అధికార పార్టీ నాయకులు ఇళ్ల స్థలాల కోసం సచివాలయంలో ఆన్‌లైన్ చేయించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులపై ఎం.బూర్జవలస విఆర్ఒ, మరో గ్రామ విఆర్ఒ కలిసి సమగ్ర దర్యాప్తు చేసి అనర్హులుగా గుర్తించి దరఖాస్తులను తిరస్కరించారు. మళ్లీ దరఖాస్తు చేసినప్పటికీ అనర్హులు కావడంతో రెగ్యులర్ విఆర్ఒ రేవతి రిజెక్ట్ చేశారు. ఇళ్ల పట్టాలు ఇవ్వాలని విఆర్ఒపై అధికార పార్టీ నాయకులు ఒత్తిడి చేసినా ఆమె తలొగ్గలేదు. అధికార పార్టీ నాయకులు పంతాలకు వెళ్లి ఒకరోజు రెగ్యులర్ విఆర్ఒ రేవతితో సెలవు పెట్టించి మెట్టవలసలో పనిచేస్తున్న విఆర్ఒకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆ ఒక్కరోజులోనే అనర్హులకు ఇళ్ల పట్టాలకు ఆమోదం తెలిపి సంతకాలు చేసి ఆన్‌లైన్ చేశారు.

ఒక్కో స్థలం విలువ రూ.3 లక్షలు

ఎం.బూర్జవలస పంచాయతీలోని జగనన్న లేఅవుట్లో ఒక్కొక్క స్థలం రూ.3 లక్షలు ధర పలుకుతుంది. జగనన్న ఇళ్ల స్థలాలకు రూ.లక్షల్లో ధర పలకడంతో అనర్హులకు పట్టాలు ఇచ్చి అమ్ముకుని సొమ్ము చేసుకునేందుకు అధికార పార్టీ నేతలు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇళ్ల పట్టాల అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇళ్ల పట్టాలు అవినీతిపై దర్యాప్తు

ఎం.బూర్జవలస పంచాయతీలో ఇళ్ల పట్టాల అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటాం. అనర్హులకు ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లు నిర్ధారణ అయితే చర్యలు తప్పవు. ఇంటి నిర్మాణం కోసం సొంత స్థలం లేని పేదలకు మాత్రమే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి.

- దోల రాజేశ్వరరావు, తహశీల్దార్

17, 84, 85 జిఒలను రద్దు చేయాలని

కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ విద్యా రంగాన్ని కనుమరుగు చేసే జిఒ 17, 84, 85లను రద్దు చేయాలని ఎపి విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన ఆదివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి కమిటీ నాయకులు ఎ.సదాశివరావు, డి.ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతోపాటు మాతృభాషను కొనసాగించాలన్నారు. ఖాళీగా ఉన్న 50,677 ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఇపిపి అమలు చేయొద్దని కోరారు. ధర్నాలో నాయకులు వెంకరమణ, ధనుంజయ, నాయుడు, రామారావు, సత్యారావు, సత్యనారాయణ, రమేష్ నాయుడు, శ్రీదేవి పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కమిటీ సభ్యులు

మజ్జి నర్సింగరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తండ్రి మజ్జి నర్సింగరావు పెద్దకర్మ కార్యక్రమాన్ని ఆదివారం మెట్రో కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింగరావు చిత్రపటానికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మంత్రులు పి.రాజన్నదొర, గుడివాడ అమర్నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, విశాఖపట్నం మేయర్ జి.హరి వెంకట కుమారి, ఎంపిలు బెల్లాన చంద్రశేఖర్, ఎంవివి సత్యనారాయణ, ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, కురసాల కన్నబాబు, శంబంగి వెంకట చినప్పలనాయుడు, అలజంగి జోగారావు, కడుబండి శ్రీనివాసరావు, కంబాల జోగులు, ఎమ్మెల్సీలు పి.సురేష్‌బాబు, రఘురాజు, పి.విక్రాంత్, పాకలపాటి రఘు వర్మ, తదితరులున్నారు.



నర్సింగరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

చదరంగం క్రీడాకారుల ఎంపిక పూర్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు జిల్లా నుండి టాప్-4 క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీలలో జి.చరణ్, జి.పర్వేష్, ఎ.ప్రసాద్, రంబ శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఈ నెల 27 నుండి 30 వరకు స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరుపున పాల్గొననున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జ్వాలాముఖి, కోశాధికారి అశ్విన్ కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఎం.గణేష్‌నాయుడు, ఆర్బిటర్లుగా వి.వెంకటేష్, కె.ధనలక్ష్మి, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అర్హులైన ప్రతిఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆదివారం గుంకలంలో 730 మందికి ఇళ్ల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలో పట్టాలు పొందే అర్హత ఉన్నప్పటికీ కొన్ని కారణాలవల్ల గతంలో మంజూరు కాలేని వారిలో ప్రస్తుతం 730 మందిని గుర్తించి పట్టాలు అందజేసినట్లు తెలిపారు. 2020లో 13 వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంత త్వరగా ఇళ్లు నిర్మించుకుంటే అంత త్వరగా సౌకర్యాలు మెరుగుపడతాయని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్, సహాయ కమిషనర్ ప్రసాదరావు, తహశీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

క్రీడాకారులకు ప్రోత్సాహం: కోలగట్ల

విజయనగరం టౌన్ : క్రీడలకు, క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బాక్సింగ్ పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆదివారం తన నివాసం వద్ద ఆయన అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, మన రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. సెట్విజ్ సిఇఒ రాంగోపాల్, వైసిపి నాయకులు కంటుభుక్త తవిటిరాజు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన రీజనల్ క్రీడా పోటీల్లో విజయనగరానికి చెందిన కేంద్రీయ విద్యాలయ విద్యార్థినిపి.విశ్వకృప సత్తా చాటింది. డిస్కస్ త్రోలో బంగారు, రిలేలో కాంస్య పతకాలు సాధించింది. ఆమెను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల అభినందించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

నగరంలోని వివిధ డివిజన్లలో చేపట్టిన ప్రారంభ, శంకుస్థాపన కార్యక్రమాలలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. 33వ డివిజన్ మయూరి జంక్షన్ నుండి శ్రీనివాసకాలేజీకి వెళ్లే బిటి రహదారిని ప్రారంభించారు. 38వ డివిజన్ ఉడా కాలనీ ఫేజ్-3 శివాలయం వద్ద చెరువు అభివృద్ధి పనులను ప్రారంభించారు. 36వ డివిజన్ విటి అగ్రహారం మజ్జిపేట చర్చి రోడ్డు వద్ద అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జివి రంగారావు, తొగురోతు సంధ్యారాణి, బాలి పద్మావతి, జోనల్ ఇన్‌ఛార్జులు కె.శ్రీనివాసరావు, రెడ్డి గురుమూర్తి, మారం బాలబ్రహ్మారెడ్డి, బొద్దాన అప్పారావు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగ పరిశ్రమలకు అనుకూలం

వ్యవసాయరంగ పరిశ్రమలకు జిల్లా ఎంతో అనుకూలంగా ఉంటుందని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్.పాపారావు అన్నారు. నిర్మాణరంగ పరిశ్రమలపై ఆసక్తి పెరుగుతోందన్నారు. ఎస్.కోటలో స్మాల్‌స్కేల్ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కీలక నిర్ణయం చేసిందన్నారు. కొత్తవలసలో ఫుడ్‌పార్కుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. వివిధ రంగాల్లో అవగాహన, సృజనాత్మకత, ఆర్థికంగా అవకాశం ఉన్నవారు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా పరిశ్రమలు ఏర్పాటుచేయడం ద్వారా మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని వివరించారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి పరిశ్రమల శాఖ జిఎం పాపారావు ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

- నిర్మాణరంగ పరిశ్రమలపై ఆసక్తి పెరుగుతోంది
- ఎస్.కోటలో స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు నిర్ణయం
- కొత్తవలసలో ఫుడ్‌పార్కుకు సన్నాహాలు
- ఔత్సాహికులకు ప్రభుత్వ ప్రోత్సాహం
- 'ప్రజాశక్తి'తో పరిశ్రమల శాఖ జిఎం ఆర్.పాపారావు ముఖాముఖి

? జిల్లాలో ఎక్కువగా ఏ రంగానికి చెందిన పరిశ్రమలు ఉన్నాయి?.

జిల్లాలో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 40 వరకు ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఉండగా, ఒక్క మన జిల్లాలోనే 17 వరకు ఉన్నాయి. జ్యూట్ పరిశ్రమలు చాలా కాలంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం చాలా వరకు మూతపడ్డాయి. పారిశ్రామిక అభివృద్ధికి కూడా జిల్లాలో పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి.

? పెద్ద కంపెనీలు ఏమైనా ఉన్నాయా? ఉంటే ఎక్కడ?.

పూసపాటిరేగ ప్రాంతంలో రెండు ఫార్మా కంపెనీలు, కొత్తవలస ప్రాంతంలో రెండు స్టీల్ పరిశ్రమలు ఉన్నాయి. ఉన్నంతలో అవే మన జిల్లాలో పెద్ద కంపెనీలు. ఇవి కాకుండా విజయనగరం బయోటెక్ వంటి మధ్యతరహా పరిశ్రమలు 25 వరకు ఉన్నాయి.

? మన జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ఉన్న వనరులు, అవకాశాలు ఏమిటి?.

మన జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో వరి ప్రధానమైన పంట. వరి ఉత్పత్తికి తగ్గట్టు ధాన్యం మిల్లులు లేవు. పక్కనే ఉన్న పార్వతీపురం జిల్లాతో పోల్చినా మన జిల్లాలో తక్కువే. మామిడి సాగులో మన జిల్లాది రాష్ట్రంలో మూడో స్థానం. మొక్కజొన్న, పత్తి కూడా విస్తారంగా సాగవుతున్నాయి. ఇక చిరుధాన్యాల సాగును ఇటీవల ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పాల ఉత్పత్తి కూడా ఎక్కువగానే ఉంది. కానీ, వీటిని ప్రాసెసింగ్ చేసే పరిశ్రమలు జిల్లాలో లేవు. వ్యవసాయ, ఉద్యాన వాటి అనుబంధ రంగాలకు చెందిన పరిశ్రమలు కుప్పలు తెప్పలుగా ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.



? పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయా? ప్రోత్సాహకాలు ఏమిటి?.

మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు, చిరుధాన్యాలకు సంబంధించిన ప్యాకింగ్ మెటీరియల్ తయారీ, వివిధ రకాల పండ్ల రసాల తయారీ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే మామిడి తాండ్రకు ప్రసిద్ధి చెందిన కొత్తవలస మండలం రెల్లిలో 50 ఎకరాలకుపైగా ప్రభుత్వం కేటాయించింది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కేటాయించడం ద్వారా యూనిట్లు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా వీటి ద్వారా మహిళలకు విరివిగా ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి.

? ఇతర రంగాలకు చెందిన పరిశ్రమల స్థాపనకు అవకాశాలు లేవా?.

అన్ని రంగాలకు చెందిన పరిశ్రమలూ మన జిల్లాలో స్థాపించాలన్న తలంపుతో ప్రభుత్వం ఉంది. ఎస్.కోట ప్రాంతంలో వేరొక పరిశ్రమ కోసం సేకరించి 9 ఎకరాల భూమిని ఇందుకోసం కేటాయిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అక్కడ రకరకాల స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేయాలని ఆలోచన ఉంది. ఇప్పటికే ఈ భూమి ఎపిఐఐసికి కేటాయించారు.

? ఇటీవల కాలంలో ఏయే రంగాలకు చెందిన పరిశ్రమలు పెరిగాయి? వాటికి ఆదరణ ఎలా ఉంది?.

నిర్మాణ రంగానికి చెందిన బ్రిక్స్, స్టోన్ క్రషర్స్, పివిసి డోర్స్ తదితరాలతోపాటు పనికి అవసరమయ్యే మిల్లర్స్, క్రెయిన్స్ తదితర యంత్రాలు, పనిముట్ల అద్దె యూనిట్లు పెరిగాయి. గ్రానైట్ కృత్రిమ తయారీ వంటివి ఏర్పాటయ్యాయి. సారిపల్లి పారిశ్రామిక ప్రాంతంలో రూ.50 లక్షల వ్యయంతో క్యారీ బ్యాగ్స్ తయారీ యూనిట్ కూడా ఏర్పడింది.

? ప్రభుత్వం తరపున సహకారం ఎలా ఉంది?.

ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద జిల్లాలో ఏటా కొన్ని యూనిట్లు మంజూరు అవుతున్నాయి. గతేడాది ప్రభుత్వ సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తున్నాం. ఖాదీబోర్డు, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ, జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యాన లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నాం. గత ఏడాది 106 మందికి చిన్నపరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తరపున సాయం అందింది.

? జిల్లాలో పారిశ్రామికవాడల పరిస్థితి ఏమిటి?.

విజయనగరంలోని విటి అగ్రహారం, సారిపల్లి, కంటకాపల్లి, బొబ్బిలి (గ్రోత్ సెంటర్)లో పారిశ్రామికవాడలు ఉన్నాయి. వీటిలో కొన్ని పరిశ్రమలు చాలా కాలం క్రితమే మూతపడ్డాయి. మరికొన్ని యథాతథంగా నడుస్తున్నాయి. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తే ఎపిఐఐసి ద్వారా భూములు కేటాయించే అవకాశం ఉంది.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఉధృతంగా ప్రవహిస్తున్న నాగావళి

నాగావళికి పెరిగిన వరద ఉధృతి

వంగర: నాగావళి నదిలో వరద నీరు భారీగా ప్రవహిస్తుంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం తోటపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో అధికారులు ప్రాజెక్టు గేట్లు ఎత్తివేశారు. దీంతో ఆదివారం ఉదయం నుంచి నాగావళి నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ ఏడాది ఇంతవరకు కొంతమేర మాత్రమే ప్రవహించిన నాగావళి ప్రస్తుతం జలకలను సంతరించుకుంది. మండలంలోని వివిధ గ్రామాల వైపుగా నాగావళి, సువర్ణముఖి, వేగావతి ఈ మూడు నదులు ప్రవహిస్తున్నాయి. అయితే నాగావళిలో భారీగా వరద నీరు ప్రవహిస్తుండగా, సువర్ణముఖి, వేగావతి ఈ రెండు నదుల్లో మాత్రం ప్రస్తుతం కొంతమేర మాత్రమే నీరు ప్రవహిస్తుంది.

గురుకులంలో మిగులు సీట్లకు దరఖాస్తులు

వేపాడ: స్థానిక బిఆర్‌అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ టిఎం ఫోర్స్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 31, 6వ తరగతిలో 13 , 7వ తరగతిలో 19, 8వ తరగతిలో 12, ఇంటర్మీడియట్‌లో ఎంపిసి 6 సీట్లు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ చేరాల్సిన వారు పదో తరగతి మార్కుల పాస్ అయి ఉండాలన్నారు. ఆసక్తి గల బాలికలు నుండి దరఖాస్తులు కోరుతున్నామని చెప్పారు. దరఖాస్తుతో పాటు రికార్డు షీట్స్, స్టడీ, పాస్ ఆధార్, తల్లి ఆధార్, తండ్రి ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఫిజికల్ ఫిట్నెస్ సర్టిఫికేట్, తల్లి బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌తో స్కూల్‌కి వచ్చి చేరాలన్నారు.

వంగర: మండలంలోని మద్దువలస డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇంచార్జి ప్రిన్సిపల్ జి. సూర్య కుమారి తెలిపారు. 5, 6, 7, 8, 9 తరగతులతోపాటు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపిసిలో చేరేందుకు సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు గురుకులానికి వచ్చి ధ్రువపత్రాలు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 8328027417 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

డైట్‌లో 25 వరకు ధ్రువపత్రాల పరిశీలన

నెల్లిమర్ల: 2023-25 విద్యా సంవత్సరంలో డైట్‌లో చేరబోయే విద్యార్థులకు ధ్రువ పత్రాల పరిశీలన ఈ నెల 25వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ తిరుపతినాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ, ప్రగతి డిఇడి కళాశాల కొత్త వలస కళాశాలల్లో సీటు పొంది ధ్రువ పత్రాల పరిశీలనకు హాజరు కాని వారు ఈనెల 25న ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ ధ్రువ పత్రాలతో హాజరు కావాలని కోరారు. డైట్ 2023–25 బ్యాచ్ మొదటి సంవత్సరం తరగతులు ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతాయని ప్రిన్సిపల్ ఎన్. తిరుపతి నాయుడు తెలిపారు.

తూతూ మంత్రంగా పిచ్చిమొక్కల తొలగింపు

పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కూలీలు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట వద్ద గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ వసతి గృహం ఆవరణలో పిచ్చి మొక్కలను ఆదివారం తూతూ మంత్రంగా తొలగించారు. గతంలో ఈ పాఠశాలను కలెక్టర్ సందర్శించినపుడు పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. దీంతో పలుమార్లు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో ఎట్టకేలకు ఆదివారం ఒక గంట పాటు ఉపాధి హామీ కూలీలతో తూతూ మంత్రంగా ముళ్ల పొదలను, పిచ్చి మొక్కలను తొలగించి చేతులు దులుపుకున్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

దుస్తులను పంపిణీ చేస్తున్న డిఎస్‌పి, తదితరులు

దెంకాడ: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఆపర్ డిఎస్‌పి ఎల్. శేషాద్రి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 50 మంది పేదలకు ఆదివారం బట్టలు, వంట సామగ్రి తదితరులు సుమారు రూ. 50వేలు విలువ చేసే వస్తువులను పంపిణీ చేశారు. అమ్మసొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకోవడం మంచి పరిణామమన్నారు. అందరికీ డబ్బులున్నా కొంత మంది మాత్రమే సేవా కార్యక్రమాలు చేస్తుంటారని చెప్పారు. అనంతరం అమ్మసొసైటీ దాతలు ఝాన్సీలక్ష్మీ, సాంబశివరావులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అమ్మసొసైటీ ట్రెజరర్ పురుషోత్తం, ఆర్ఐఒ, కళాశాల ప్రిన్సిపల్ ఎం. ఆదినారాయణ, స్థానిక సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ వైద్యానికి ఆర్థిక సహాయం

బొబ్బిలి: అనారోగ్యంతో విజయనగరం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వార్డు వాలంటీర్ జి.నాగరాజుకు మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ ఆర్థిక సహాయం చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే వాలంటీర్ అనారోగ్యం బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందడంతో చైర్మన్ మురళి ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిలను తెలుసుకుని వైద్య ఖర్చులు కోసం రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

బొబ్బిలి రూరల్: ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ విభాగం ఎస్‌డిఎ వి.లక్ష్మి అన్నారు. మండలంలోని మెట్టవలస ప్రకృతి వనరుల కేంద్రం వద్ద ఆదివారం చేపల వ్యర్థాలతో మీనామృతం తయారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేపల వ్యర్థాలతో మీనామృతం తయారు చేస్తే పంటలకు గ్రోత్ కషాయంగా వినియోగించవచ్చునని చెప్పారు. మీనామృతం పంటలకు ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. అగ్గినాస్త్రంతో చీడపీడలను నివారించవచ్చునని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది జి.ప్రసాద్ పాల్గొన్నారు.

బొబ్బిలిలో జిమ్ ప్రారంభం

బొబ్బిలి: పట్టణంలోని గాంధీబొమ్మ రోడ్డులో జిమ్‌ను టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ఆదివారం ప్రారంభించారు. ఆరోగ్యానికి జిమ్ దోహదం చేస్తుందని బేబినాయన, తెంటు రాజా అన్నారు. జిమ్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిత్యం జిమ్ చేయడం వల్ల మంచి ఆరోగ్యం పొందవచ్చునని చెప్పారు.

బాడంగిలో పికె టీం రహస్య సర్వే

బాడంగి: రహస్య ఫ్రీ పోల్ సర్వే అనే పేరుతో మండలంలోని పికె టీమ్ రహస్య సర్వే చేపడుతుంది. విజయవాడ న్యూ న్యూటన్ న్యూస్ పేరుతో 15 మంది వరకు బొబ్బిలి నియోజకవర్గంలో తిరుగుతున్నారు. ఈ టీమ్ అంతా బొబ్బిలి ఎమ్మెల్యేగా ఎవరైతే బాగుంటుందని ప్రజలను అడుగుతున్నారు. వైసిపి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు, టిడిపి నుంచి బేబినాయన, తెంటు లక్ష్మునాయుడులో ఎవరు అయితే బాగుంటుందని ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారు.

వ్యాసరచన పోటీలకు స్పందన

ప్రజాశక్తి–విజయనగరం కోట

సమాజ అభ్యున్నతికి స్వచ్ఛంద సంస్థలు తోడ్పాటును అందించాలని సీనియర్ న్యాయవాది పి.వెంకట రామారావు కోరారు. ఆదివారం నగరంలోని కణపాక యూత్ హాస్టల్లో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విశ్వ కళా పరిషత్, నా ఊరు విజయనగరం, వనిత వాకర్స్ క్లబ్, గురజాడ బ్రాహ్మణ సమాఖ్య, తిలక్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీలకు 150 మంది విద్యార్థులకు హాజరయ్యారు. విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. మన్యంలో విశేష సేవలు అందిస్తున్న వృద్ధమిత్ర కోఆర్డినేటర్, హెచ్‌సి కృష్ణమూర్తిని, రచయిత్రి కుసుమంచి శ్రీదేవి, మ్యూజికల్ డైరెక్టర్ పివిఆర్ రాజా, లిఫ్టింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షులు కంది గౌరీ శంకర్‌ను సత్కరించారు.

నత్తనడకన నాడు-నేడు పనులు

- శిథిలావస్థకు చేరుతున్న భవనాలు
- పట్టించుకోని యంత్రాంగం

ప్రజాశక్తి– బొబ్బిలి

బొబ్బిలి పట్టణం, మండలంలో నాడు–నేడు పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండో విడత నాడు–నేడు పనులు నత్తనడకన సాగడంతో మౌలిక సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పనకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాడు–నేడు అమలు చేస్తుంది. మొదటి విడత పనులు పూర్తి చేసిన ప్రభుత్వం రెండో విడత పనులు నత్తనడకన సాగడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో తరగతి గదులు వర్షానికి కారిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. బొబ్బిలి మున్సిపాలిటీలో 9 పాఠశాలలు, మండలంలోని 31 పాఠశాలలకు నాడు–నేడు రెండో విడత పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి.

మున్సిపాలిటీలో ముందుకు సాగని పనులు

మున్సిపాలిటీలో నాడు–నేడు పనులు ముందుకు సాగడం లేదు. తొమ్మిది పాఠశాలలకు ప్రభుత్వం రెండో విడత నిధులు రూ.4.66 కోట్లు మంజూరు చేసింది. వీటిలో రూ. 1.48 కోట్లు విడుదల చేయగా రూ.76లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. నాడు–నేడు పనులు చేపట్టి ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. విద్యార్థులు సంఖ్య పెరగడంతో తరగతి గదులు చాలక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మల్లమ్మపేటలో శిథిలావస్థకు చేరిన మల్లమ్మదేవి పాఠశాల భవనం

గ్రామాల్లో నత్తనడకన పనులు

మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో నాడు–నేడు పనులు నత్తనడకన సాగుతున్నాయి. నాడు–నేడు రెండో విడతలో 31 పాఠశాలలకు ప్రభుత్వం రూ.8.73కోట్లు మంజూరు చేసింది. ఇప్పటి వరకు రూ.2.64కోట్లు విడుదలైనప్పటికి రూ.2.37కోట్లు ఖర్చు చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులను కూడా ఖర్చు చేయలేదంటే పనులు ఎలా జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చును. పనులు నత్తనడకన సాగడంతో కొన్ని భవనాలు వర్షానికి కారడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

25 పాఠశాలలు నాడు-నేడుకు దూరం

బొబ్బిలి మండలం, మున్సిపాలిటీలో 25 పాఠశాలలు నాడు–నేడుకు దూరంగా ఉన్నాయి. నాడు–నేడు పనులకు దూరంగా ఉన్న పాఠశాలల్లో చాలా భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు భయపడుతూ తరగతులు చెపుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారు. మండలంలోని కె.కొండలెవలస, కేశయవలస, ఎం.పనుకువలస, సీతయ్యపేట, మోసూరువలస, వెంకటరాయుడుపేట, కుముందానపేట, కమ్మవలస, బంకురువలస, అప్పయ్యపేట, గొంగాడవలస, భోజరాజపురం, లింగంవలస, వాకాడవలస, అన్నంనాయుడువలస, వెలగవలస, నిమ్మలపాడు, బత్తినవలస, రెడ్డియ్యవలస, కొల్లివలస గ్రామాల్లో ఉన్న పాఠశాలలు నాడు–నేడు పనులకు దూరంగా ఉండగా మున్సిపాలిటీలో మల్లమ్మపేట, మల్లమ్మదేవి పాఠశాల, గాంధీ బొమ్మ వద్ద ఉన్న తాండ్రపాపరాయ పాఠశాల, పూల్ బాగ్‌లో ఉన్న వల్లభాయ్ పాఠశాల, ఎరుకులవీధిలో ఉన్న నేతాజీ పాఠశాలలు నాడు–నేడుకు దూరంగా ఉన్నాయి. నాడు–నేడు పనులకు దూరంగా ఉన్న పాఠశాలలు అన్ని భవనాలు శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వం స్పందించి నాడు–నేడు నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. మూడో విడతలో నాడు–నేడు పనులకు ప్రతిపాదనలు చేసినట్లు ఎంఇఒ లక్ష్మణరావు, మున్సిపల్ ఎఇ సురేష్ చెప్పారు.

ఎండిఎం కార్మికులను ప్రభుత్వం గుర్తించాలి

ప్రజాశక్తి– శృంగవరపుకోట

మధ్యాహ్న భోజన (ఎండిఎం) కార్మికులను ప్రభుత్వం గుర్తించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులతో జులై 31న కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాకు సంబంధించిన గోడపత్రికను పట్టణంలోని మహాత్మా గాంధీ పార్క్ ఆవరణంలో సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి నెలకు పదివేల రూపాయలు జీతం ఇవ్వాలన్నారు. నిరంతరం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలన్నారు. రేషన్‌లైజేషన్ పేరుతో స్కూల్స్ విలీనం చేయడం వల్ల ఉపాధి కోల్పోతున్న కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలని, సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకానికి కేటాయిస్తున్న బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. జగనన్న గోరుముద్ద పేరుతో ఇస్తున్న మెనూ చార్జీలకు సంబంధం లేకుండా రోజుకో ఐటెంతో ప్రభుత్వం మెనూ తయారు చేసి పిల్లలకు పెట్టాలని వర్కర్లపై భారాన్ని మోపిందని ఒకపక్క పని భారం మరో పక్క ధరల భారంతో పెరగని వేతనాలు మెనూ ఛార్జీలతో కార్మికులు పథకం నిర్వహించడం కష్టసాధ్యంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం జూలై 31న సోమవారం కలెక్టరేట్ ఆఫీస్ వద్ద జరుగు ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల కమిటీ అధ్యక్షులు ఎర్ర దేవుడమ్మ, ఉపాధ్యక్షులు అనకాపల్లి భవాని, కమిటీ సభ్యులు సిహెచ్ రాఘవి, పి.వి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

అథ్లెటిక్స్ కోచ్‌కు సన్మానం

ప్రజాశక్తి– బొబ్బిలి

అథ్లెటిక్ కోచ్ రావు శ్రీనివాసరావును జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి ఆదివారం సన్మానించారు. వీరబొబ్బిలి క్రీడా మైదానంలో నిరుద్యోగ యువతకు ఉచితంగా అథ్లెటిక్స్, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, పోలీసు ఉద్యోగాలు కోసం శిక్షణ ఇస్తున్నందుకు ఆయన్ను అభినందించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కోచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఎస్.గంగాధర్, పాల్గొన్నారు.

జిఒ 117ను రద్దు చేయాలి

ప్రజాశక్తి– బొబ్బిలి

విద్యా రంగాన్ని నాశనం చేసే జీవో 117ను రద్దు చేయాలని ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.జోగారావు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివారం ఎస్‌టియు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగాన్ని నాశనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

100 మందికి మందులు పంపిణీ

ప్రజాశక్తి– బొబ్బిలి

స్థానిక 'జగద్గురు పీఠం' ఆధ్వర్యంలో కండ్లకలక వ్యాధితో బాధపడుతున్న సుమారు 100 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ ఎస్ సుధా స్రవంతి మాట్లాడుతూ ఈ మందు వల్ల కండ్లకలక రెండు రోజుల్లో తగ్గిపోతుందన్నారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని ఈ మందులను ప్రతి ఒక్కరూ వినియోగించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు కృష్ణదాస్ మాస్టర్, శ్రీనివాసరావు, ధనుంజయరావు, పెంట తిరుపతి నాయుడు అలజంగి జెడ్‌పిహెచ్ స్కూల్ నుండి కొంత మంది విద్యార్థులు వచ్చి సహాయ సహకారాలు అందించారు.

ఓటర్ల నమోదు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి –నెల్లిమర్ల

బిఎల్‌ఒలు ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా విచారణ సక్రమంగా నిర్వహించాలని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు సూచించారు. ఆదివారం నగర పంచాయతి పరిధి జరపుపేట–2వ సచివాలయంలోని 17, 18 వార్డుల్లో బిఎల్‌ఒలు, రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న వ్యక్తి ఓటరుగా చేరే అవకాశాన్ని కల్పించాలన్నారు. బిఎల్‌ఒలు ఇంటింటికి వెళ్ళి కుటుంబ సభ్యుల వివరాలను ఫార్మెట్‌లో నమోదు చేసి, మృతుల వివరాలను ఓటర్ల జాబితాల నుంచి తొలగించాలని సూచించారు. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకు జరిగే ఈ కార్యక్రమం షెడ్యూల్ గురించి అన్ని రాజకీయ పక్షాల నాయకులు సమాచారం అందించి భాగస్వాములను చేయాలని రామారావు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దిల వాసు, అవనాపు సత్యనారయణ, తాలాడ సన్నిబాబు, పోలుబొతు నారాయణమూర్తి, నల్లి శ్రీను, కాళ్ళ రాజశేఖర్, తుమ్ము నారాయణమూర్తి, పాండ్రంకి సత్యనారయణ, అవనాపు విజయ భాస్కర్, నల్లి శివ ప్రసాద్, బిఎల్‌ఒలు వెంకటలక్ష్మీ, శాంభవి, రేవతి, సంతోషి కుమారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓటు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న నాయకులు

రక్తచరిత్రకు రోజులు దగ్గర పడ్డాయి : టిడిపి

ప్రజాశక్తి– మెంటాడ

జగన్మోహన్‌రెడ్డి చరిత్ర, రక్త చరిత్ర రెండింటికీ రోజులు దగ్గర పడ్డాయని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆదివారం పెదచామలాపల్లిలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్ చిన్నాన్న వివేకానంద రెడ్డి హత్య రక్తపు మరకలను ఎన్నికల ముందు టిడిపి పై వేసారని గుర్తు చేశారు. ఆ మరక ఎవరికి అంటుకుంది జగన్ అని ప్రశ్నించారు. జగన్ అండ్ కో చరిత్రకు ప్రజలు, రక్త చరిత్రకు న్యాయస్థానం ముగింపు పలికే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. వివేకా హత్యని టిడిపి పై ఆపాదించి, ఎన్నికలలో లబ్ధి పొందిన జగన్ మళ్ళీ ఎన్నికలు వచ్చేసరికి జైలు తప్పదని అన్నారు. అప్పుడు జగన్ ఒక్కడే జైలుకు వెళ్లాడని, ఇప్పుడు కుటుంబంతో జైలుకు మకాం మార్చేయవచ్చని ఎద్దేవా చేశారు. తెల్ల కాగితం లాంటి చంద్రబాబు నాయుడుకు రక్తపు మరకలు అంటిద్దామని చూసారని అన్నారు. రక్తపు మరకలు చెరిపి, గొడ్డలి పోటును గుండె పోటుగా చిత్రీకరించడం, కేసు పెట్టకుండా బెదిరించడం, అన్న జగన్ ముఖ్య మంత్రిగా ఉండగా ప్రక్క రాష్ట్రానికి న్యాయం కోసం జగన్ చెల్లి సునీత పరుగులు తీయడం సిగ్గుచేటన్నారు. ఆమెను బెదిరించడం, నాలుగేళ్ల నరకం చూపించారని చెల్లి సునీత కన్నీరు పెట్టడం వాస్తవం కాదాని ప్రశ్నించారు. వివేక హత్యకు కారణాలు ఏమిటో సొంత చెల్లి షర్మిల చెప్పారని అన్నారు. కుటుంబంలో తగాదాలు ఉంటే చంపుకుంటూ పోతే రాష్ట్రంలో ఏ ఒక్కరూ వుండరని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి శ్రేణులు చలుమూరి వెంకటరావు, రెడ్డి సత్యనారాయణ, డి.అనిల్, గుమ్మిడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుమ్మడి సంధ్యారాణి

సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి– గంట్యాడ

గ్రామాల్లో ఉన్న సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపిపి పి. హైమావతి అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని వాటిని స్థానిక ఎంపిటిసిలు, సర్పంచులు తమ దృష్టికి తీసుకు వస్తారని అధికారులంతా వెంటనే పరిష్కారం చేయడానికి కృషి చేయాలని అన్నారు. ముందుగా వ్యవసాయ శాఖ అధికారి పి శ్యామ్ కుమార్ మాట్లాడుతూ సకాలంలో రైతులకు విత్తనాలను అన్ని ఆర్‌బికెల ద్వారా పూర్తిగా అందిస్తున్నామన్నారు. త్వరలో డిఎపి, యూరియా ఎరువులను అందించడానికి సిద్ధంగా ఉన్నామని వాటిని నిల్వ చేయడానికి గుడాములను ఏర్పాటు చేయాలని అన్నారు. వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని డయేరియా వైరస్ ఇతర వ్యాధులను నిర్మూలించడానికి ఏఎన్ఎం ద్వారా పరిశీలన చేయిస్తున్నామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలోని ఫ్యామిలీ డాక్టర్లు 26 రోజులు సేవలను అందిస్తున్నారన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని జగనన్న కాలనీలకు మంచినీటి సౌకర్యం కల్పించామన్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారి రాజగోపాల్ రావు మాట్లాడుతూ ఇంతవరకు పూర్తి చేసిన ఇండ్లకు బిల్లులను పూర్తిగా అందిచామన్నారు. నిర్మాణం దశలో ఉన్న వాటిని పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని అన్నారు. విద్యుత్ శాఖ అధికారి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గ్రామాలలోని వాలిపోయి, విరిగిపడిన స్తంభాలను వెంటనే మారుస్తున్నామన్నారు. కొత్తగా స్తంభాలను వేయడానికి ఆయా పంచాయతీలు డబ్బులు చెల్లించాలన్నారు. మురపాక శ్మశానం రోడ్డు వద్ద కల్వర్టు, లెక్కిడాం కల్వర్టు శిధిలావస్థలో ఉన్నాయని మరమ్మత్తులు చేపట్టాలని మురపాక గ్రామ సర్పంచ్ ఈదిబిల్లి రమేష్, లెక్కిడాం పిఎసిఎస్ అధ్యక్షులు లచ్చిరెడ్డి దేవుడమ్మ కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి సుంకర సుజాత, ఎంపిడిఒ భానోజీరావు, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్‌కుమార్, పలు శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి పీరుబండి హైమావతి

సక్రమంగా సేవా కేంద్రాల నిర్వహణ

జోనల్ చీఫ్ మేనేజర్ వేణుగోపాల్

ప్రజాశక్తి - రామభద్రపురం

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖాతాదారుల సేవా కేంద్రాల్లో సేవలు పక్కాగా నిర్వహించి వినియోగ దారులకు సక్రమ సేవలు అందించాలని విశాఖ జోనల్ ఫైనాన్షియల్ ఇంక్లుజన్ చీఫ్ మేనేజర్ చుండూరు వేణుగోపాల్ ఆదేశించారు. ఆదివారం బొబ్బిలిలో పలు ఖాతాదారుల సేవా కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రాలు గ్రామీణ ప్రాంత ఖాతాదారులకు సకాలంలో సేవలు అందించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందరి ఖాతాదారులకు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా, సురక్ష భీమా, అటల్ పెన్షన్ యోజన పథకాలు వర్తింప జేయాలని తెలిపారు. ఈ పథకాల్లో చేరి సహజ మరణం పొందితే రూ.2 లక్షలు, ఏక్సిడెంట్ మరణాలకు రూ.4 లక్షలు వర్తిస్తాయని తెలిపారు. ప్రతీ సిఎస్‌పి ఈ పథకం వివరాలు కేంద్రాల్లో ప్రదర్శనగా ఉంచి అర్హులైన వారికి నమోదు చేయాలని అన్నారు. ఆరికతోట, రామభద్రపురం, గొల్లపేట గ్రామాల్లో ఉన్న కేంద్రాలు తనికీ చేసి పలు సూచనలు, సలహాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌ఎంపిఎల్ జిల్లా కోఆర్డినేటర్ మూడడ్ల వెంకటరావు, రామభద్ర పురం సిఎస్‌పి పివి సత్యారావు, ఆరికతోట సిఎస్‌పి అరుణశ్రీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జోనల్ చీఫ్ మేనేజర్ వేణుగోపాల్

రామతీర్థానికి అయోధ్య రామపాదుకలు

ప్రజాశక్తి– నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానానికి అయోధ్య నుంచి రామ పాదుకలను తీసుకొచ్చారు. అయోధ్యలో నిర్మాణం జరుగుతున్న దివ్య రామ మందిరంలో ప్రతిష్ఠించే సంకల్పంతో అయోధ్యకు చెందిన చల్ల శ్రీనివాస శాస్త్రి 10 కిలోల వెండితో స్వామివారి పాదుకలను కొయంబత్తూరులో తయారు చేయించి వాటిని ఆదివారం ఇక్కడకు తీసుకు వచ్చారు. రామతీర్థం సుదర్శనం విజయకుమార్ గారింటి వద్ద పాదుకలకు అర్చనాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రామతీర్థం కొండపై కొలువైన కోదండ రాముని వద్ద, రామస్వామి వారి ఆలయంలో పూజాదికాలు నిర్వహించారు. కొత్తపేట వద్ద రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లా శ్రీనివాస్ శాస్త్రి, సుదర్శనం విజయకుమార్, ధర్మకర్తలు బ్రహ్మదేవ కేశవరావు, కొండేటి సురేష్, రేగాన గోవింద రావు, ముంత ప్రసాదరావు, భక్తులు పాల్గొని పాదుకలను సేవించుకున్నారు.

రామతీర్థం చేరుకున్న రామ పాదుకలు ఇవే..

వీడిన హత్యకేసు మిస్టరీ

ప్రజాశక్తి– బొండపల్లి

మండలంలోని గొట్లాం రైల్వే ట్రేక్ పై అనుమానస్పద స్థితిలో లభ్యమైన మృత దేహానికి సంబంధించిన కేసు మిస్టరీని పోలీసులు చేదించారు. ఈ కేసుకు సంబంధించి అయిదగురును అరెస్టు చేయగా మరో ఇద్దరి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయని బొబ్బిలి ఇంచార్జి డిఎస్‌పి చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు ఆదివారం బొండపల్లి పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 13న రాయగడ నుండి విజయనగరం వైపు వెల్తున్న ఐరన్ లోడ్ లారీని పథకం ప్రకారం మార్గమధ్యలో ప్రయాణీకులు మాదిరిగా ఆపి డ్రైవర్‌తో పరిచయం పెంచుకుని కొంత మంది లారీ ఎక్కారు. లారీలో డ్రైవర్ జగదీష్ యాదవ్ ఒక్కరే ఉండడాన్ని గమనించిన హరి, ఈశ్వరరావు, అర్నేపల్లి ధనుంజయడు, మీసాల జయరాం, మీసాల చంద్రశేఖర్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులు లారీ పై దృష్టి సారించారు. రూ.40లక్షల విలువైన ఐరన్ లోడును గమనించి మార్గం మధ్యలో డ్రైవర్ జగదీష్‌ను వీరంతా కలిసి హత్య చేశారు. అనంతరం మృత దేహాన్ని గొట్లాం బై పాస్ కిందను గల రైలు పట్టాలపై పడేసి లోడు లారీతో తగరపు వలస మీదుగా భోగాపురం తరలించారు. అక్కడ తుక్కు వ్యాపారస్తుడు బెవర సాయి బాబాకు ఇనుముతో పాటు లారీని కూడా అమ్మే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో లారీ యజమాని తమ లారీ ఇంకా గమ్యానికి చేరుకోలేదని పోలీసులు ఫిర్యాదు ఇచ్చారు. కాగా బొబ్బిలి రైల్వే పోలీసులు ఈ కేసును ఈ నెల 20న బొండపల్లి పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. దీంతో బొండపల్లి, గజపతినగరం పోలీసులు లారీ డ్రైవర్ జగదీష్ యాదవ్‌ను హత్య చేసినట్లు గుర్తించి అయిదగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ. 40 లక్షల విలువైన ఐరన్ లోడ్ లారీని స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరి ప్రదాన నిందుతుల కోసం రెండు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని డిఎస్‌పి తెలిపారు. ఈ హత్యకేసు మిస్టరీని చేదించడంలో చాక చక్యంగా వ్యవహరించిన గజపతినగరం సిఐ ఎల్. నారాయణ రావు, ఎస్ఐ ఎస్ రవి, బొండపల్లి పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలోల గజపతినగరం సిఐ లెంక అప్పలనాయుడు, బొండపల్లి ఎస్ఐ రవి, ఏఎస్ఐలు శ్రీనివాసరావు, గోపి సిబ్బంది పాల్గొన్నారు.

కేసు వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి చక్రవర్తి

IN THE HONOURABLE COURT OF THE PRINICIPAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
EP 206/2022 IN AA 446/2013
Between:
M/s. Shriram Finance Company Ltd.,. rep., by its G.P.A Holder SRI.VADDADI VIJAY, S/O Venkata Raju, Hindu, Age 50 Years, R/At Pradeep Nagar, Vizianagaram.
...DECREE HOLDER/CLAIMANT
And:
1. RENUKA ENGINEERING WORKS REP. BY MERAPALA BHAVANI AND OTHERS
...JUDGEMENT DEBTOR NO.1
NOTICE UNDER ORDER 21 RULE 22 OF CPC TO 1st JDR
1. Renuka engineering works rep. By merapala bhavani, hindu, age 46 years, paturu(v), vepada (m), vizianagaram dist.
Whereas you have failed to satisfy an Award passed against you on 29-06-2013 in the A.A. 446 / 2013 in favor of the Dhr for an amount of Rs.9,90,994/- (nine lakhs ninty thousand nine hundred and ninety four) and the DHr filed the above Execution Petition for Execution of the Award praying the Honourable court to order for attachment of the schedule property as per the provisions under Order 21 rule 54 there by sale of the property under the provisions in CPC to satisfy the EP amount of Rs.17,16,424/- (seventy lakhs sixteen thousand four hundred twenty four rupees) Whereas it is ordered that notice under Order 21 rule 22 of CPC by way of this Publication Notice since you are avoiding to take notice. Therefore, it is ordered that you should attend to the court on **26-07-2023 at 10.30 AM** before the Court, in person or through your Advocate failing which the matter would be decided in your absence by setting you exparte.
Maturu Srinivasa Rao (advocate), flat no.201, subhadra apartments, kothagraham, 1st lane, vizianagaram. Mobile no.9490898234.

IN THE HONOURABLE COURT OF THE PRINICIPAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
EP 251/2022 IN AA 302/2013
Between:
M/s.Shriram Finance Company Ltd.,. rep., by its G.P.A Holder SRI. VADDADI VIJAY, S/O Venkata Raju, Hindu, Age 50 Years, R/At Pradeep Nagar, Vizianagaram.
...DECREE HOLDER/CLAIMANT
And:
1.RENUKA ENGINEERING WORKS REP. BY MERAPALA BHAVANI AND another
...JUDGEMENT DEBTOR NO.1
NOTICE UNDER ORDER 21 RULE 22 OF CPC TO 1st JDR
1.Renuka engineering works rep. By merapala bhavani, hindu, age 46 years, paturu(v), vepada (m), vizianagaram dist.
Whereas you have failed to satisfy an Award passed against you on 21-05-2013 in the A.A.302/2013 in favor of the Dhr for an amount of Rs.8,84,572/- (eight lakhs eighty four thousand five hundred and seventy two rupees) and the DHr filed the above Execution Petition for Execution of the Award praying the Honourable court to order for attachment of the schedule property as per the provisions under Order 21 rule 54 there by sale of the property under the provisions in CPC to satisfy the EP amount of Rs.15,56,973/- (fifteen lakhs fifty six thousand nine hundred seventy three rupees) Whereas it is ordered that notice under Order 21 rule 22 of CPC by way of this Publication Notice since you are avoiding to take notice. Therefore, it is ordered that you should attend to the court on **10-8-2023 at 10.30 AM** before the Court, in person or through your Advocate failing which the matter would be decided in your absence by setting you exparte.
Maturu Srinivasa Rao (advocate), flat no. 201, subhadra apartments, kothagraham, 1st lane, vizianagaram. Mobile no. 9490898234.